క్లుప్తంగా

క్రీడల్లో బీసీ గురుకుల విద్యార్థుల ప్రతిభ



విజేతలైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, సిబ్బంది

శ్రీశైలంప్రాజెక్ట్: నియోజక వర్గ స్థాయి క్రీడల్లో శ్రీశైలం మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. మంగళవారం ఆత్మకూరులో జరిగిన 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్లు, 1,500 మీటర్లు పరుగు పందేలు, షాట్‌పుట్, లాంగ్‌జంప్, హైజంప్ క్రీడల్లో మొదటి స్థానం సాధించి బంగారు పథకాలను సాధించారు. ఈ సందర్భంగా బుధవారం గెలుపొందిన క్రీడాకారులను ప్రిన్సిపాల్ బండ్లమూడి జవహర్, ఏటీపీ. జాన్సీ, పీఈటీలు రాధాకృష్ణ, సుధాకర్, తిమోతి అభినందించారు.

మహానందిలో రేపు హుండీ కానుకల లెక్కింపు

మహానంది: మహానంది దేవస్థానంలో ఈ నెల 29న హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి, కోదండరామాలయం, ఆంజనేయస్వామి, వినాయకనంది ఆలయాలతో పాటు అన్నదానం, గోసంరక్షణ విభాగాల్లోని హుండీ కానుకలను లెక్కిస్తామని చెప్పారు. స్థానిక అభిషేక మండపంలో జరిగే లెక్కింపు కార్యక్రమానికి సిబ్బంది అందరూ హాజరు కావాలన్నారు.

పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ప్రభుత్వ మోడల్ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్లను స్పాట్ అడ్మిషన్‌తో భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ డి.రంగయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాస్ అయిన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో అక్టోబర్ 3వ తేదీన ఉదయం 09:30 గంటలకు జరిగే కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని పేర్కొన్నారు. సీటు పొందే విద్యార్థి సుమారు. రు.6,000 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఇతర వివరాలకు సెల్.9901234206కు సంప్రదించాలన్నారు.

డిగ్రీ కళాశాల అభివృద్ధికి సహకరించాలి

నందికొట్కూరు: ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహకరించాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ సునీత అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కళాశాల లో విద్యార్థులు చేరే విధంగా పూర్వ విద్యార్థు లు సలహాలు, సూచనలిచ్చి సహకరించాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఎలాంటి సమస్య లున్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అక్టోబర్ 21న మొట్టమొదటి సారి డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించేందుకు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి ఉస్మాన్‌బేగ్, సింగిల్ విండో మాజీ చైర్మన్ మద్దూరు హరిసర్వోత్తమరెడ్డి, పూర్వ విద్యార్థి చిట్టిబాబు, శేఖరప్ప తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించేలా తీర్చిదిద్దండి



జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న వైస్ ఎంపీపీ, హెచ్‌ఎం

జూపాడుబంగ్లా: విద్యార్థులకు మెరుగైన చదువుతో పాటు క్రీడల్లో రాణించేలా తీర్చిదిద్దాలని వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి ఉపాధ్యాయులను కోరారు. మండ్లెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లా గేమ్స్‌కు ఎంపిక కావడంతో బుధవారం ఆయన వారిని అభినందించారు. అండర్–14 విభాగంలో బా ల్‌బ్యాడ్మింటన్ లో మధుశేఖర్, అండర్–17 విభాగంలో దయాకర్ జిల్లా క్రీడలకు ఎంపికై నట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాసు లు తెలిపారు. వాలీబాల్ క్రీడలో అండర్–14, 17 విభాగాల్లో బాలురు, బాలికలు జిల్లా క్రీడలకు ఎంపికై నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గిరిధర్‌రెడ్డి, ఉపాధ్యాయులు రాజారావు, అస్మత్‌ఖాతుం, లీలాకుమారి, పీఈటీ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల నిర్బంధం తగదు

శ్రీశైలంప్రాజెక్ట్: అంగన్‌వాడీల న్యాయమైన పోరాటాలకు నిర్బంధం తగదని ఎఐటీయూసీ నాయకుడు నాగిరెడ్డి, ఓబులయ్య అన్నారు. బుధవారం శ్రీశైలం తహసీల్దార్ రాజేంద్రసింగ్‌కు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు వినతి పత్రం సమర్పించారు. గత సోమవారం విజయవాడలో చేపట్టిన కార్యక్రమాన్ని ప్రభుత్వం విఫలం చేసిందని,అలాగే అంగన్‌వాడీలను నిర్బంధించారని ఆరోపించారు. కార్యక్రమంలో కాశమ్మ, రమణమ్మ, శోభారాణి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పల్లె ప్రజల ఆరోగ్యానికి భరోసా

- గ్రామీణ ప్రాంతాల్లో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు
- ఫ్యామిలీ డాక్టర్ ద్వారా ఇంటింటికీ వైద్య సేవలు
- జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు





కొత్తపల్లి మండలం ఎర్రమఠంలో ఇంటి వద్దకు వెళ్లి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్రీనివాసులు,గువ్వలకుంట్ల గ్రామంలో 104 వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నందికొట్కూరు: గత టీడీపీ పాలనలో మెరుగైన వైద్యం కోసం గ్రామీణ ప్రాంతాల ప్రజలు పట్టణాలకు వెళ్లాల్సిన దుస్థితి ఉండేది. ఆర్థిక స్థోమత లేని వారు చికిత్స చేయించుకోలేక మంచానికే పరిమితమయ్యే వారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక వైద్యరంగానికి పెద్దపీట వేసింది. గ్రామీణ ప్రాంతాల ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తూ.. గ్రామంలోనే మెరుగైన, నాణ్యమైన వైద్యం వైద్యం అందించేందుకు వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను అందుబాటులోకి తీసుకువచ్చింది. అంతేకాకుండా ఫ్యామిలీ డాక్టర్ ద్వారా ఆస్పత్రికి వెళ్లలేని రోగులకు ఇంటి వద్దే వైద్యసేవలు అందిస్తోంది. తాజాగా జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో ఇంటింటి సర్వే నిర్వహిస్తూ కుటుంబసభ్యులందరికీ వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహిస్తున్నారు.

నియోజకవర్గంలో 60 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు

నియోజకవర్గంలో 60 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేయడంతో ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుంది. గ్రామంలో ప్రతి 2500 మందికి ఒక వైఎస్సార్ హెల్త్ సెంటర్ చొప్పున నూతన భవనాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటున్నారు. హెల్త్ సెంటర్‌లో ఎంఎల్‌హెచ్‌పీతో పాటు ఏఎన్‌ఎం, ఆశవర్కర్ సేవలు అందిస్తారు. ప్రస్తుతం వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. పలు చోట్ల భవనాలు ప్రారంభించి వైద్య సేవలు అందిస్తున్నారు.


ఇంటి వద్దకే వైద్య సేవలు

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అమలు చేసిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో ఇంటి వద్దకే వైద్యం అందిస్తున్నారు. ప్రతి గ్రామాన్ని నెలలో మూడు సార్లు, వీలైతే నాలుగు సార్లు వైద్యులు సందర్శించి ఉదయం, మధ్యాహ్నం ఓపీ సేవలు అందిస్తున్నారు. ఆ తర్వాత మంచంపై ఉన్నవారు, నడవలేని స్థితిలో ఉన్నవారు, ఇతర వ్యాధిగ్రస్తుల ఇంటి వద్దకే వెళ్లి వైద్యం అందిస్తున్నారు. 67 రకాల మందులు ఉచితంగా ఇవ్వడమే కాకుండా, 14 రకాల వైద్య పరీక్షలు ఇంటి వద్ద వచ్చి చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, అంగన్‌వాడీ చిన్నారులకు వైద్య పరీక్షలు చేసి ఆరోగ్య స్థితిగతులు రికార్డుల్లో నమోదు చేస్తున్నారు. అంతేకాకుండా 104 వాహనం ద్వారా కూడా నేడు ప్రజలకు వైద్య చికిత్సలు అందుతున్నాయి.

ప్రజల ఆరోగ్యానికి జగనన్న సురక్ష

మారుమూల గ్రామీణ ప్రాంతాలలోని పేద ప్రజలకు సైతం మెరుగైన వైద్యసేవలు అందించాలన్న దృక్పథంతో ప్రభుత్వం ' జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమంతో కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందించేందుకు ముమ్మర చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోని వైద్యుల ఆధ్వర్యంలో సిబ్బంది బృందాలుగా ఏర్పడి గ్రామాలలో ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. దీర్ఘకాలిక రోగాలను గుర్తించిన వారికి టోకెన్లు అందజేస్తున్నారు. సర్వే అనంతరం గ్రామగ్రామాన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు నిర్వహించనున్నారు. ఇందులో టోకెన్లు పొందిన వారికి వైద్య సేవలు అందించనున్నారు.

ప్రతి నెలా మందులు ఇస్తున్నారు



అనారోగ్యంతో బాధపడుతున్న నాకు ఇంటికి వచ్చి డాక్టర్లు చూస్తున్నారు. వైద్యం కోసం గతంలో పట్టణానికి వెళ్లి ప్రైవేట్ వైద్యశాలలో చూపించుకొనేవాడిని. ఇప్పుడు వైద్యులు ఇంటి వచ్చి వైద్యం చేస్తు న్నారు. అవసరమైతే రక్త పరీక్షలు చేస్తున్నారు. వెంటనే మందులు అందిస్తున్నారు. నెలలో రెండు సార్లు వస్తున్నారు. సరిపడా మందులు ఇస్తున్నారు.

– దానమయ్య, 10 బొల్లవరం గ్రామం, నందికొట్కూరు మండలం

గ్రామంలోనే వైద్య సేవలు



మా గ్రామంలోనే ప్రభుత్వం వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసింది. దీంతో మాకు ఏ అత్యవసరమైనా వైద్య సేవలు హెల్త్ క్లినిక్‌లోని సిబ్బంది వెంటనే పరీక్షలు చేస్తున్నారు. అంతేకాకుండా ప్రతి నెల 104 వాహనం ద్వారా వైద్యులు గ్రామంలోకి వస్తున్నారు. అక్కడే రక్తపరీక్షలు చేస్తున్నారు. మెరుగైన వైద్యపరీక్షలు నిర్వహించి అత్యవసం అయినప్పుడు 108 వాహనంలో పట్టణాలకు తరలిస్తున్నారు.

– ఎర్రన్న జీ. వీరాపురం గ్రామం, కొత్తపల్లి మండలం

ప్రణాళిక ప్రకారం శిబిరాలు

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి గ్రామానికి ప్రతి గ్రామానికి రెండు లేక మూడు సార్లు 104 వాహనంతో వెళుతున్నాం. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గ్రామంలో ఓపీ చూస్తున్నాం. తర్వాత మంచానికే పరిమితమైన వారి ఇంటి వద్దకు వెళ్లి వైద్యం చేస్తున్నాం. 67 రకాల రకాల మందులు విలేజ్ క్లినిక్‌లో అందుబాటులో ఉంటున్నాయి.

– డాక్టర్ సుబ్రహ్మణ్యం, బ్రాహ్మణకొట్కూరు

మహానందిలో నేడు ధర్మకర్తల మండలి సమావేశం

మహానంది: మహానందిలో ధర్మకర్తల మండలి సభ్యుల సమావేశం గురువారం నిర్వహిస్తున్నట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం తెలిపారు. ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో 18వ సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, చేపట్టాల్సిన పనుల కార్యాచరణ ప్రణాళికలపై చర్చిస్తారన్నారు. చైర్మన్ కార్యాలయంలో జరిగే సమావేశానికి ధర్మకర్తలు అందరూ హాజరు కావాలని కోరారు.

వరిలో అగ్గితెగులు

మహానంది: బొల్లవరంలోని వరిపొలాల్లో అగ్గితెగులు గుర్తించినట్లు మండల వ్యవసాయాధికారి నాగేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం గ్రామంలోని వరి పొలాలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఆకులపై ముదురు రంగు అంచుతో, మధ్యలో బూడిదరంగు మచ్చలు ఏర్పడతాయన్నారు. క్రమేపీ మచ్చలు కలిసిపోయి ఆకులు ఎండి పైరు తగలబడినట్లు ఉంటుందన్నారు. ఆకులపై అగ్గితెగులు మచ్చలను గుర్తించిన వెంటనే నివారణ చర్యలు చేపట్టాలన్నారు. లేదంటే మెడవిరుపు తెగులుగా మారి నష్ట తీవ్రత అధికంగా ఉంటుందన్నారు.

నివారణ చర్యలు..

తెగులు నివారణకు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏఓ సూచించారు. పొలం గట్ల మీద కలుపు నివారించాలని, తెగులు రాకముందే ముందు జాగ్రత్తగా సూడోమోనాస్ ఫోర్ల సెన్స్ అనే జీవశిలీంద్రనాశిని లీటరు నీటికి ఐదు గ్రాములు కలిపి పిచికారీ చేయాలన్నారు. నత్రజని ఎరువులను ఎక్కువగా ఒకేసారి వేయకుండా పలు దఫాలుగా కొద్దిమోతాదులో వినియోగించాలన్నారు. అగ్గితెగులును గమనించిన వెంటనే ట్రైసైక్లోజల్ అనే మందును లీటరు నీటికి 0.6 గ్రాములు లేదా ఐసోప్రోతయోలెన్ మందును లీటరు నీటికి 1.5 మి.లీటర్ల చొప్పున వాడాలని సూచించారు. లేదంటే కాసుగోమైసిన్ మందును లీటరు నీటికి 2.5 మిల్లీ లీటర్ల పరిమాణంలో పిచికారీ చేసుకుంటే మంచి ప్రయోజనాలు ఉంటాయన్నారు.

థ్యాంక్యూ సీఎం సార్



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బేడ బుడగజంగాలు

జూపాడుబంగ్లా: పాదయాత్రలో ఇచ్చిన మాట మేరకు బేడ బుడజ జంగాల ఎస్సీ రిజర్వేషన్ పునరుద్ధరణకు రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపటం సంతోషించదగిన విషయమని బుడగజంగాల నాయకుడు జంగాల సుంకన్న, జిల్లా జాయింట్ సెక్రటరీ కోసిక తిరుమలేశ్వరరెడ్డి, జేసీఎస్ మండల అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం జూపాడుబంగ్లా సంతగేటు ఆవరణలోని వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలవేశారు. అలాగే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి థ్యాంక్యూ సీఎం సార్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు సూదిరెడ్డి రమేష్‌రెడ్డి, బేడ బుడగ జంగాల నాయకులు మధు, పరిగ సుంకన్న, మోతెరాముడు, ఇప్పెశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఆరోగ్య సురక్ష సర్వే



శ్రీశైలంప్రాజెక్ట్‌లో గర్భిణి గాదం.స్వాతికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

శ్రీశైలంప్రాజెక్ట్: రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తుంది. ఇప్పటి వరకు కనీసం బి.పి. షుగర్ టెస్టులు కూడా చేయించుకోని వారికి సైతం ఇంటి వద్దనే ఆరోగ్యసిబ్బంది, ఆశావర్కర్లు, వలంటీర్లు వైద్య పరీక్షలు చేస్తున్నారు. అంతే కాకుండా వారికి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. బుధవారం సున్నిపెంటలోని కో–ఆపరేటివ్ స్టోర్స్ వెనుక భాగంలో ఓ 5 నెలల గర్భిణికి హిమోగ్లోబిన్, ఐరన్, బి.పి తదితర పరీక్షలను నిర్వహించి అవసరమైన మందులను అందించారు.

మహానంది: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్షను విజయవంతం చేయాలని బండిఆత్మకూరు ఎంపీడీఓ వాసుదేవ గుప్త, వైద్యాధికారిణి ఏ.భావనరెడ్డి అన్నారు. ఏ.కోడూరులో శనివారం నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఏర్పాట్లను బుధవారం పరిశీలించారు.

పాములపాడు: రాష్ట్రంలో ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే చేపట్టినట్లు హెల్త్ ఎడ్యుకేటర్ మల్లికార్జున, టీబీ సూపర్వైజర్ రవికుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని రుద్రవరం, వేంపెంట, మద్దూరు, తుమ్మలూరు గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వేను పరిశీలించారు.

85శాతం సర్వే పూర్తి

కొత్తపల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సర్వేను గ్రామ వలంటీర్లు త్వరగా పూర్తిచేయాలని ఎంపీడీఓ మేరి సూచించారు. బుధవారం మండల పరిధిలోని దుద్యాల గ్రామ సచివాలయంలో అధికారులు, గ్రామవలంటీర్లతో సమావేశం నిర్వహించారు. సర్వేను 85 శాతం పూర్తిచేశారని, మిగత సర్వే 29వ తేదీలోపు పూర్తిచేయాలని సూచించారు.

సర్వే వేగవంతం చేయండి

పగిద్యాల: రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఎంపీడీఓ వెంకటరమణ గ్రామ వలంటీర్లను ఆదేశించారు. బుధవారం మండలంలోని పడమర ప్రాతకోట గ్రామంలో నిర్వహిస్తున్న ఆరోగ్య సురక్ష సర్వేను పరిశీలించారు.

మిడుతూరు : ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఆశావర్కర్లు, ఆరోగ్యసిబ్బంది ఇంటింటి సర్వేను ప్రతి రోజూ నిర్వహించి రోగుల వివరాలు సేకరించాలని ఎంపీడీఓ జీఎన్ఎస్ రెడ్డి సూచించారు. బుధవారం ఆయన మండలంలోని చింతలపల్లి, దేవనూరు గ్రామాలలోని సచివాలయాలను తనిఖీ చేశారు.

నందికొట్కూరు రూరల్ : ప్రతి ఒక్కరి ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని పీహెచ్‌సీ వైద్యుడు సుబ్రహ్మణ్యం అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా కోనేటమ్మపల్లి గ్రామంలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, గ్రామంలో ఇంటింటి సర్వేను పరిశీలించారు.

ఇది బృహత్తర కార్యం

నేను ఇపుడు 5వ నెల గర్భవతిని, నాతల్లిదండ్రులు నా బాగోగుల కోసం, డాక్టర్లకు చూపించడం కోసం మూడు రోజుల క్రితమే అత్తవారింటి నుంచి తీసుకొచ్చారు. పైసా ఖర్చు లేకుండా జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఇంటి వద్దనే నాకు అన్ని రకాల టెస్టులు చేశారు. నా ఆరోగ్యం కోసం పుట్టబోయే బిడ్డ ఆరోగ్యం కోసం వైద్యసలహాలు ఇవ్వడమే కాకుండా మందులను ఇచ్చారు. ఇటువంటి కార్యక్రమాలు భవిష్యత్ తరాలకు ఎంతోమేలు.

– గాదం.స్వాతి, గర్భిణి, శ్రీశైలంప్రాజెక్ట్

ఉద్యానవనాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



పార్కును పరిశీలిస్తున్న ఈఓ డి.పెద్దిరాజు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థాన పరిధిలోని పలు ఉద్యానవనాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులను శ్రీశైల ఈఓ డి.పెద్దిరాజు ఆదేశించారు. బుధవారం ఉద్యానవనాలు, రుద్రపార్క్, శంకరవనం, సర్వతోభద్రవనం, దర్శనం క్యూలైన్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అన్ని ఉద్యానవనాల్లో, పూలతోటలలో కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తొలగిస్తుండాలని ఆదేశించారు. అక్కడ నిరంతరం మంచి నీటి సరఫరా, శౌచాలయాల నిర్వహణ, లైటింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. దర్శన క్యూలైన్లలో మరిన్ని ఫ్యాన్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈఈలు వి.రామకృష్ణ, మురళీధర్‌రెడ్డి, ఏఈవో ఫణిధరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందిస్తాం

కొత్తపల్లి: మండలంలోని విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తామని కర్నూలు విద్యుత్‌శాఖ ఈఈ వెంకటేశ్వర్లు, ఈఈ (ట్రాన్స్‌ఫార్మర్స్) భాగ్యలత అన్నారు. బుధవారం రాత్రి స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కొత్త హైటల్టేజ్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చారు. వారు మాట్లాడుతూ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 3.15 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో లోటల్టేజ్‌లో విద్యుత్ వచ్చేదన్నారు. దాని స్థానంలో 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చామన్నారు. దీంతో లోటల్టేజ్ విద్యుత్ సరఫరా అయ్యే గ్రామాలలో ఇకపై ఈ సమస్య ఉండదన్నారు. కార్యక్రమంలో డీఈఈ ట్రాన్స్‌ఫార్మర్స్ సురేష్, ఆత్మకూరు ఏడీఈ వసంతయ్య, ఏఈ అబ్దుల్ అబిద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం



నిమజ్జనానికి తరలివెళ్తున్న వినాయకుడు

శ్రీశైలం: శ్రీశైలం క్షేత్రపరిధిలోని న్యూ స్టాఫ్ క్వార్టర్స్, వర్క్‌షాప్ వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలకు బుధవారం నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం పురవీధుల వెంట ఊరేగింపు నిర్వహించారు. వర్క్‌షాప్ గణేషుని విగ్రహం వద్ద ఉంచిన లడ్డూ వేలం పాటలో రూ.1.60లక్షలకు కాంట్రాక్టర్ వెంకటరమణ దక్కించుకున్నారు.

భగవద్గీతతో ఆధ్యాత్మిక చింతన

కొత్తపల్లి: భగవద్గీతను చదవడం ద్వారా ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన కలుగుతుందని త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి జ్ఞానవేదిక కమిటీ అధ్యక్షుడు మునిదాసు అన్నారు. బుధవారం మండలంలోని సింగరాజుపల్లె గ్రామంలో భగవద్గీత ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హిందూ జ్ఞానవేదిక, ప్రబోధ సేవాసమితి కమిటీ సభ్యులు భాస్కర్, స్వర్ణ, భాస్కర్ గౌడ్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ జాబితాలో చేర్చొద్దు

నందికొట్కూరు: బేడ బుడగ జంగం కులాన్ని ఎస్సీ జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీలో తీర్మానించడం వ్యతిరేకిస్తున్నామని మాలమహానాడు నియోజక వర్గ అధ్యక్షుడు ఏసీ నగేష్ తెలిపారు. బుధవారం పట్టణంలోని మాలమహానాడు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంటరానితనానికి గురైన కులాలలో బేడ బుడగ జంగం కులం లేదన్నారు.

కొత్త పనులను గుర్తించండి

కొత్తపల్లి: వచ్చే ఆర్థిక సంవత్సరానికి కొత్త పనులను గుర్తించాలని ఎంపీడీఓ మేరి సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాలలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి అవసరమైన కొత్త పనులను గుర్తించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీఓ రాజునాయక్, టెక్నికల్ అసిస్టెంట్లు కిరణ్‌కుమార్, ఎఫ్‌టీబీ లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీఎస్టీ కేసుపై విచారణ

మిడుతూరు: మండలపరిధిలోని ఉప్పలదడియ గ్రామంలో పొలం రస్తా విషయంలో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైంది. ఈ కేసు విచారణ నిమిత్తం ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు బుధవారం ఉప్పలదడియ గ్రామానికి విచ్చేశారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్ చేరుకొని రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట నందికొట్కూరు ఎస్ఐ రమణ, సిబ్బంది ఉన్నారు.

బైక్ చోరీ

నందికొట్కూరు: పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల రహదారిలో సేఫ్టీ వాటర్ ప్లాంట్ ఎదురుగా ఉన్న ఇంట్లో మంగళవారం రాత్రి బైక్ చోరీకి గురైనట్లు ఎస్ఐ ఎన్వీ రమణ తెలిపారు. శివరామయ్య బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించినట్లు ఫిర్యాదు చేశారన్నారు.

జిల్లాస్థాయి క్రీడాపోటీలకు ఎంపిక



ఎంపికైన గిరిజన గురుకుల విద్యార్థులతో ప్రిన్సిపాల్, సిబ్బంది



మెడల్స్, ప్రశంసా పత్రాలతో యర్రగుంట్ల విద్యార్థులు

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈనెల 25, 26 ల్లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీలలో ప్రతిభ చూపి కురుకుందా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 20 మంది విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల హెచ్‌ఎం వెంకటస్వామి, ఫిజికల్ డైరెక్టర్ చెన్నమ్మ తెలిపారు. బుధవారం జిల్లాస్థాయికి ఎంపికైన విద్యార్థులను పాఠశాలలో అభినందించారు. జిల్లాస్థాయికి ఎంపికైన డీపాల్ స్కూల్ విద్యార్థులను ప్రిన్సిపాల్ జాన్సన్ ఫాదర్, వైస్‌ప్రిన్సిపాల్ వినీత్ ఫాదర్ అభినందించారు.

శ్రీశైలంప్రాజెక్ట్: స్కూల్‌గేమ్స్ సెలెక్షన్స్‌లో నియోజకవర్గస్థాయిలో శ్రీశైలం గిరిజన గురుకుల ప్రతిభా పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్– 14 విభాగం కబడ్డీలో ఆర్.బాలేంద్రనాయక్, వాలీబాల్‌లో వి.రేవంత్‌నాయక్, కో–కోలో కె.ఉపేంద్రనాయక్, అండర్ 17 విభాగంలో కబడ్డీలో ఎస్.మహేష్‌నాయక్, వాలీబాల్‌లో ఆర్.శివరాజ్ నాయక్, కో–కోలో ఆర్.ఈశ్వర్‌నాయక్, జావెలిన్‌త్రో లో వి.చంటినాయక్, షాట్‌పుట్‌లో భార్గవ్ ఎన్నికయ్యారు. బుధవారం వీరిని ప్రిన్సిపాల్ డాక్టర్.ఎస్.జి.కిశోర్‌బాబు, పిఇటి బి.రామునాయక్ అభినందించారు.

మహానంది: విద్యతో పాటు క్రీడల్లో రాణించడం ద్వారా విద్యార్థినీ, విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు అలవడటంతో పాటు ఉజ్వల భవిష్యతు ఉంటుందని బండిఆత్మకూరు మండల విద్యాశాఖాధికారి మోహన్‌రెడ్డి తెలిపారు. యర్రగుంట్ల జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు 12మంది జిల్లా స్థాయి పోటీలకు ఎంపికవడంతో బుధవారం ప్రశంసా పత్రాలు, మెడల్స్‌తో సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజేశ్వరరెడ్డి, పీఈటీ విజయమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధికి కృషి

కొత్తపల్లి: క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంఈఓ శ్రీరాములు అన్నారు. బుధవారం మండలంలోని ఎమ్మార్సీ భవనంలో కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు క్రీడా వస్తువుల కిట్టును పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 42 పాఠశాలలకు కిట్లు మంజూరయ్యా యన్నారు. వీటిని ఆయా పాఠశాలలకు పంపిణీ చేశామని చెప్పారు. పీఈటీ మురళీనాయక్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో విద్యార్థులు భాగస్వాములవ్వాలి



ర్యాలీ నిర్వహిస్తున్న వ్యవసాయ విద్యార్థులు

మహానంది: గ్రామాల అభివృద్ధిలో వ్యవసాయ విద్యార్థులు భాగస్వాములు అవ్వాలని మహానంది వ్యవసాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ నాయక్ అన్నారు. జాతీయ సేవా పథకం దినోత్సవం సందర్భంగా బుక్కాపురంలో బుధవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు గ్రామ పరిసరాల్లో శుభ్రతా కార్యక్రమాలు చేపట్టారు. విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని తమ వంతు సేవలు అందించారు. కార్యక్రమంలో విలేజ్ అడాప్షన్ ఆఫీసర్ డాక్టర్ ఎంఎస్ రాహుల్, ఓఎస్ఏ డాక్టర్ రమేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

బెల్టుదుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

జూపాడుబంగ్లా: గ్రామాల్లో ఎవ్వరైనా బెల్టుదుకాణాలు నిర్వహించి అక్రమంగా మద్యం, నాటుసారా విక్రయించినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మారుతిశంకర్ హెచ్చరించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని తూడిచెర్ల గ్రామంలో బెల్టుదుకాణాలు నిర్వహిస్తున్న సుమన్‌గౌడు, సుహాసిని, నాగరాజుగౌడు, వెంకటరమణగౌడు, కాజన్నగౌడు, మురహరిప్రసాద్ అనే వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి 182 తెలంగాణ, కర్ణాటక, ఏపీ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిపై కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న 11మందిని అదుపులోకి తీసుకొని వారిపై ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

జీవామృతంతో పంటలకు మేలు

మహానంది: జీవామృతం ఎరువులు వాడటం ద్వారా పంటకు ఉపయోగపడే భూమిలోని సూక్ష్మజీవులు అభివృద్ధి చెంది పంట ఎదుగుదలకు ఉపయోగపడతాయని మండల వ్యవసాయాధికారి నాగేశ్వరరెడ్డి అన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ పొలంబడి కార్యక్రమంలో భాగంగా బుధవారం బొల్లవరంలో జీవామృతం ఎరువుల తయారీ, ప్రయోజనాలపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రీనివాసరెడ్డి, చంద్రశేఖర్, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆచూకీ కోసం గాలింపు



విద్యార్థులకు ధైర్యం చెబుతున్న పిఓ రవీంద్రారెడ్డి

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం గిరిజన గురుకుల పాఠశాలలో అదృశ్యమైన నలుగురు పదోతరగతి విద్యార్థుల కోసం గాలింపు కొనసాగుతోంది. కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రెడ్డప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు 48–2023 క్రైం నెంబర్ ప్రకారం బాలుల మిస్సింగ్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మకూరు నవాజ్ కట్టకు చెందిన కావేటి.నాగశేషాద్రి, తుగ్గలి మండలం రోళ్లపాడు తండాకు చెందిన రమావత్.నాగరాజు నాయక్, ఆదోని హనుమాన్ నగర్‌కు చెందిన ఎరుకలి.విజయ్, బ్రాహ్మణకొట్కూరు మండలం, కోళ్లబావాపురంకు చెందిన. బి.మద్దిలేటి గుంటూరులో గత మంగళవారం ఉన్నట్లు గుర్తించారు. అక్కడికి వెళ్లి వెతకగా ఆ ప్రాంతం నుంచి విద్యార్థులు పరారైనట్లు ఎస్ఐ గంగయ్య యాదవ్ తెలిపారు. విద్యార్థుల ఆచూకి తెలిసిన వారు సెల్‌నెం. 9121101192, 9121101194 లకు సమాచారం ఇవ్వవలసినదిగా కోరారు.

విద్యార్థుల అదృశ్యంపై విచారణ

ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి బుధవారం పాఠశాలను సందర్శించి విద్యార్థుల అదృశ్యంపై విచారణ చేపట్టారు. విద్యార్థులు, సిబ్బందిని సమావేశ పరిచి భవిష్యత్‌లో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పకడ్బందీగా వ్యవహరించాలన్నారు. విద్యార్థులు ధైర్యంగా ఉండి తమ చదువులు కొనసాగించాలని సూచించారు.